

# నిజం
## దృష్టి తెలుగు న్యూస్

TG/TEL/25/A3731

WANTED
రిపోర్టర్లు కావలెను
నిజం దృష్టి తెలుగు న్యూస్
దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని అన్ని జిల్లా కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
సెల్: 9247842354

హైదరాబాద్ ఎడిటర్: వరుదు సుజాత సంపుటి:-1 సంచిక:-244 పేజీలు:-4 సోమవారం 17-08-2026

SIMULTANEOUSLY PRINTED AT ADHILABAD I HYDERABAD |NALGONDA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | WARANGAL | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ANANTAPUR | GUNTUR| KADAPA | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్.. పార్కు, యూనివర్సిటీలో కాల్పులు

- ★అమెరికాలో మళ్లీ పెరిగిన కాల్పుల ఘటనలు
- ★కెంటకీలోని ఓ పార్కులో జరిగిన కాల్పుల్లో ఒకరు మృతి
- ★నాలుగేళ్ల చిన్నారితో సహా నలుగురికి గాయాలు
- ★వర్జీనియా యూనివర్సిటీలో మరో ఘటన, ఐదుగురికి గాయాలు
- ★కొద్దిరోజుల క్రితం జార్జియా స్కూల్‌లోనూ కాల్పుల ఘటన



అమెరికాలో గన్ కల్చర్ మరోసారి పంజా విసిరింది. నిన్న ఒక్కరోజే కెంటకీ, వర్జీనియా రాష్ట్రాల్లో జరిగిన రెండు వేర్వేరు కాల్పుల ఘటనల్లో ఒకరు మరణించగా, చిన్నారులతో సహా తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ వరుస ఘటనలు స్థానికంగా తీవ్ర భయాందోళనలకు కారణమయ్యాయి. - మిగతా 2 లో

## ఒకవైపు సైనిక విన్యాసాలు మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్

- కొరియా ద్వీపకల్పంలో అసలేం జరుగుతోంది!
- కిమ్ జాంగ్ ఉన్‌తో తన బంధం గొప్పదంటూ పాత ఫొటోను పంచుకున్న ట్రంప్
- అమెరికా-దక్షిణ కొరియా సైనిక విన్యాసాలపై తీవ్రంగా స్పందించిన ఉత్తర కొరియా
- ఇది 'అణు కూటమి'గా మారుతోందని, తీవ్రంగా స్పందిస్తామని ప్యాంగ్యాంగ్ వార్నింగ్
- కొత్త స్థాయి ముప్పును కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని స్పష్టీకరణ
- ఇటీవలే బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించి ఉద్రిక్తతలను పెంచిన ఉత్తర కొరియా



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ మధ్య సంబంధాలు ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటాయి. తాజాగా ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో కిమ్‌తో ఉన్న - మిగతా 2 లో

# బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది
# సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!

- ప్రతి ఆరు నెలలకు ఒక జాబ్ నోటిఫికేషన్ ఇస్తామని సీఎం హామీ
- సంగారెడ్డిలో 'స్మార్ట్ రేషన్ కార్డులు' పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం
- సన్నబియ్యం అందిస్తూ పేదల కడుపు నింపుతున్నామన్న రేవంత్‌రెడ్డి




రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక హామీ ఇచ్చారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒక ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేస్తామని స్పష్టం చేశారు. సంగారెడ్డిలో శనివారం 'స్మార్ట్ రేషన్ కార్డుల' పంపిణీ

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి



- స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని ఫొటోకు మంత్రి ఉత్తమ్ షరతు
- సన్న బియ్యానికి కేంద్రం పూర్తి నిధులిస్తేనే ఫొటో ముద్రిస్తామని స్పష్టం
- పేదల రేషన్ కార్డుల విషయంలో రాజకీయాలు వద్దని హితవు
- రాష్ట్రం సన్నబియ్యం ఇస్తుంటే, కేంద్రం దొడ్డు బియ్యమే ఇస్తోందని విమర్శ
- ప్రొటోకాల్ ప్రకారం రేషన్ షాపుల్లో ఇప్పటికే ప్రధాని ఫొటో ఉందని వెల్లడి

స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రాన్ని ముద్రించాలన్న - మిగతా 2 లో

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను



- షోకాజు నోటీసు లేకుండానే పార్టీ నుంచి పంపించారని ఆవేదన
- రాబోయే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తామని ధీమా
- బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల కోసం పోరాడతామని ప్రకటన
- కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రాదని జోస్యం

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత, బీఆర్ఎస్ పార్టీతో - మిగతా 2 లో

## నేను గర్వపడే 'దిమాగీ నక్సల్'ను: మోదీకి చిదంబరం కౌంటర్



- 'దిమాగీ నక్సలిజం' దేశానికి కొత్త సవాల్ అన్న ప్రధాని మోదీ
- స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోని వ్యాఖ్యలపై రేగిన దుమారం
- తనను తాను 'దిమాగీ నక్సల్' అని గర్వంగా ప్రకటించుకున్న చిదంబరం
- ప్రధాని నిరాశలో ఉన్నారంటూ విమర్శించిన కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేసిన 'దిమాగీ నక్సలిజం' (మేధోపరమైన - మిగతా 2 లో

# నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ
# ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్

- ఎర్రకోట ప్రసంగాల నిడివిలో ప్రధాని మోదీ కొత్త రికార్డు
- దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానుల్లో అగ్రస్థానం
- 13 ప్రసంగాల్లోనే 1177 నిమిషాలు మాట్లాడిన నరేంద్ర మోదీ
- నెహ్రూ, ఇందిరాల కన్నా తక్కువ ప్రసంగాలు, కానీ రెట్టింపునకు పైగా సమయం




భారత స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ సరికొత్త రికార్డు సృష్టించారు. దేశానికి సుదీర్ఘకాలం సేవలందించిన నలుగురు ప్రధానమంత్రుల్లో, ఎర్రకోట నుంచి అత్యధిక సమయం

## సీఎం విజయ్ తల్లిపై నైనార్ నాగేంద్రన్ వివాదాస్పద వ్యాఖ్యలు

### తీవ్రంగా ఖండించిన టీవీకే, అన్నామలై



- ★ఉదయనిధిని ఉద్దేశించి మీ తండ్రి ఎక్కడ అని ప్రశ్నించిన విజయ్
- ★ఇంట్లో ఉన్న తల్లిని అడిగితే తెలుస్తుందన్న నాగేంద్రన్
- ★సీఎం తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను అంగీకరించలేమన్న అన్నామలై

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ తల్లిని ఉద్దేశించి తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు నైనార్ - మిగతా 2 లో

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్



- చంద్రగిరి సమీపంలో ఏనుగుల సంచారంతో ప్రజలు ఆందోళన
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశం
- డ్రోన్లతో నిఘా, రాత్రి పూట గస్తీ పెంచాలని కీలక సూచనలు
- పంట నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందిస్తామని హామీ
- పరిస్థితిని బట్టి హనుమాన్ బృందాలను మోహరించాలని ఆదేశం

తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోని ఎర్రవారిపాలెం మరియు సమీప గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచారం స్థానికంగా - మిగతా 2 లో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్



- విజయవాడలో మెగా డీఎస్సీ టీచర్ల ఆత్మగౌరవ ర్యాలీ
- వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఉపాధ్యాయుల తీవ్ర ఆగ్రహం
- ప్రచారం ఆపకుంటే ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామని హెచ్చరిక
- ర్యాలీలో పాల్గొన్న వేలాది మంది నూతన ఉపాధ్యాయులు
- కష్టపడి ఉద్యోగాలు సాధిస్తే కించపరుస్తున్నారని ఆవేదన

తమ నియామకాలపై వైసీపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారంటూ మెగా - మిగతా 2 లో

# సీఎం క్యాంప్ ఆఫీసులో మహిళలకు 'హై టీ'

- ఆత్మీయంగా పలకరించిన చంద్రబాబు.. ఫొటోలు ఇవిగో!
- 'స్త్రీ శక్తి' పథకం ఏడాది పూర్తైన వేళ ప్రత్యేక కార్యక్రమం
- మహిళలతో కలిసి పల్లె వెలుగు బస్సులో ప్రయాణించిన సీఎం
- క్యాంప్ కార్యాలయంలో మహిళా లబ్ధిదారులకు తేనీటి విందు
- తమ భవిష్యత్ లక్ష్యాలను ముఖ్యమంత్రికి వివరించిన మహిళలు
- అమరావతి పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎం ఆదేశం




ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం శనివారం ఓ అరుదైన, ఆత్మీయ కార్యక్రమానికి వేదికైంది. 'స్త్రీ శక్తి' పథకం ద్వారా లబ్ధి పొందుతున్న మహిళలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తేనీటి విందు (హై టీ) ఇచ్చి, వారితో

## విజయవాడలో డీఎస్సీ టీచర్ల 'ఆత్మగౌరవ ర్యాలీ'.. వైసీపీపై ఫైర్

మొదటిపేజీ తరువాయి – డీఎస్సీ–2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులు ఆదివారం విజయవాడలో భారీ 'ఆత్మగౌరవ ర్యాలీ' నిర్వహించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చేస్తున్న ఆరోపణలు వెంటనే ఆపకపోతే వైసీపీని ప్రకాశం బ్యారేజీలో కలిపేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి సుమారు 7,000 మందికి పైగా నూతన ఉపాధ్యాయులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ భారీ ప్రదర్శన, అంబేద్కర్ స్మృతివనం వరకు కొనసాగింది. "వైసీపీ విష ప్రచారం నశించాలి", "టీచర్ల ఆత్మగౌరవాన్ని కించపరచొద్దు" అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి కష్టపడి చదివి, మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు సాధించామని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగం సాధించామన్న కనీస సంతోషాన్ని వైసీపీ నేతలు తమ విష ప్రచారంతో దూరం చేస్తున్నారని వాపోయారు. తమ ప్రతిభను శంకించి, నియామకాలపై బురద జల్లడం వల్ల తాము, తమ కుటుంబ సభ్యులు మానసికంగా కుంగిపోతున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, తిరుపతితో పాటు పలు జిల్లాల్లో ఇలాంటి నిరసన ర్యాలీలు నిర్వహించామని, అయినా వైసీపీ నేతల తీరు మారకపోవడం దారుణమన్నారు. తమపై విమర్శలు చేస్తున్న వారికి సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించి తమ నిరసనను నిర్వహించారు. తమపై విష ప్రచారం తక్షణమే ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని వారు స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్ చేతబడి చేయిస్తోంది.. సీఎం రేవంత్ సంచలన ఆరోపణలు!

మొదటిపేజీ తరువాయి – కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండున్నరేళ్లలో 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిందని, మరో 10 వేల పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానని, యువత ప్రతిపక్షాల మాయలో పడకుండా పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేసిన సీఎం, ఇది కేవలం కాగితం ముక్క కాదని, పేదల ఆకలి తీర్చే ఆత్మగౌరవ కార్డు అని అన్నారు. గత ప్రభుత్వాలు దొడ్డు బియ్యం ఇచ్చి స్కామ్‌లు చేస్తే, తాము సన్నబియ్యం అందించి పేదల కడుపు నింపుతున్నామని తెలిపారు. బతుకమ్మ చీరల పేరుతో గతంలో నాసిరకం పంపిణీ చేస్తే, తాము పాలపిట్ట, చిలకపచ్చ రంగు చీరలతో మహిళల గౌరవం పెంచామని తెలిపారు. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. తెలంగాణ బాగుపడకూడదని, రాష్ట్రంలో కరువు రావాలని కోరుకుంటూ బీఆర్ఎస్ నేతలు చేతబడులు, అఘోర పూజలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కర్ణాటక, తమిళనాడు ఆలయాల్లో అర్ధరాత్రి చేసిన పూజల రహస్యాన్ని బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తాము మంజూరు చేసిన 7 లక్షల ఇందిరమ్మ ఇళ్ల గ్రామాల్లోనే ఓట్లు అడుగుతామని, బీఆర్ఎస్ వారు కట్టిన డబ్బా ఇళ్ల వద్ద ఓట్లు అడగగలరా? అని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేత జగ్గారెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. రాహుల్ గాంధీ రాముడైతే, జగ్గారెడ్డి హనుమంతుడని కొనియాడారు. అనంతరం నెహ్రూ, రాజీవ్ గాంధీ విగ్రహాలను ఆవిష్కరించారు.

## మోదీ ఫొటో కావాలంటే సన్నబియ్యం డబ్బులివ్వండి

మొదటిపేజీ తరువాయి – డిమాండ్‌పై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించారు. సన్న బియ్యం పథకానికి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు సమకూరిస్తేనే, కార్డులపై ప్రధాని ఫొటోను ముద్రించే అంశాన్ని పరిశీలిస్తామని ఆయన స్పష్టం చేశారు. పేదల ఆకలి తీర్చే ఈ పథకం విషయంలో అనవసర వివాదాలు సృష్టించవద్దని ఆయన హితవు పలికారు. సూర్యాపేటలో నిన్న మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి.. రేషన్ బియ్యం పంపిణీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు సన్న బియ్యం సరఫరా చేసేందుకు రూ. 14.9 కోట్లు ఖర్చు చేస్తోందని, అయితే కేంద్రం నుంచి కేవలం దొడ్డు బియ్యం మాత్రమే సరఫరా అవుతున్నాయని ఆయన తెలిపారు. కొందరు తగినంత ఆర్థిక సహకారం అందించకుండానే రేషన్ బియ్యం పంపిణీపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పట్ల ఉన్న గౌరవంతో, ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఇప్పటికే రేషన్ దుకాణాల్లో ప్రధాని ఫొటోను ప్రదర్శిస్తున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన చిత్రాలను కార్డులపై ముద్రించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రాణం ఉన్నంతవరకు బీఆర్ఎస్‌తో కలవను

మొదటిపేజీ తరువాయి – భవిష్యత్తులో కలిసి పనిచేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, "ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. కుటుంబ సభ్యులతో వ్యక్తిగత సంబంధాలు వేరని, రాజకీయాలు వేరని ఆమె తేల్చి చెప్పారు. అయితే, బీఆర్ఎస్ ను అధికారంలోకి రాకుండా చేయడం తమ సిద్ధాంతం కాదని కూడా అన్నారు. పార్టీ నుంచి తనను బహిష్కరించిన తీరుపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి షోకాజు నోటీసు ఇవ్వకుండానే తనను పార్టీ నుంచి పంపించేశారని, సస్పెన్షన్‌కు ఏడాది ముందు నుంచే తనను పక్కన పెట్టారని ఆరోపించారు. అయినప్పటికీ, నైతిక విలువలకు కట్టుబడి తానే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. తన తండ్రి కేసీఆర్‌ను తాను ఎన్నడూ ఎదిరించలేదని ఆమె పేర్కొన్నారు. తన నూతన పార్టీకి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వస్తామని కవిత ధీమా వ్యక్తం చేశారు. "మాది ఆర్ట్ మూవీ కాదు, కమర్షియల్ మూవీ. నేను గెలవకపోతే ఇంకెవరు గెలుస్తారో తెలియదు" అని వ్యాఖ్యానించారు. తన తండ్రి కేసీఆర్ తరహాలోనే తాను కూడా సరికొత్త చరిత్ర సృష్టిస్తానని ధీమాగా చెప్పారు. సామాజిక న్యాయం, లౌకికవాదమే తమ పార్టీ ప్రధాన ఎజెండా అని ఆమె వెల్లడించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుంటున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విమర్శించారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించేందుకు ఢిల్లీ వేదికగా పోరాటం చేస్తామని పిలుపునిచ్చారు. ఇప్పటికే 100 రోజుల్లోనే 42 నియోజకవర్గాల్లో పార్టీ కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వివరించారు.

## యూఎస్‌లో ఆగని గన్ కల్చర్.. పార్కు యూనివర్సిటీలో కాల్పులు



మొదటిపేజీ తరువాయి – వివరాల్లోకి వెళితే.. కెంటకీ రాష్ట్రంలోని లెక్సింగ్‌టన్ నగరంలో ఉన్న చార్లెస్ యంగ్ పార్కులో శనివారం సాయంత్రం దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో నలుగురు గాయపడ్డారు. గాయపడిన వారిలో నాలుగేళ్ల చిన్నారి, 14 ఏళ్ల బాలుడు, మరో ఇద్దరు పెద్దలు ఉన్నారని లెక్సింగ్‌టన్ పోలీస్ చీఫ్ లారెన్స్ వెదర్స్ తెలిపారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు వెల్లడించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన పోలీసులు లెక్సింగ్‌టన్ డౌన్‌టౌన్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, నిందితుల కోసం గాలింపు చేపట్టారు. అయితే, ఈ ఘటనకు సంబంధించి నిందితుల వివరాలను పోలీసులు ఇంకా వెల్లడించలేదు. ఇదే తరహాలో వర్జీనియా స్టేట్ యూనివర్సిటీలోనూ శనివారం తెల్లవారుజామున కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యూనివర్సిటీలోని ఓ రెసిడెన్స్ హాల్ వెలుపల జరిగిన ఈ ఘటనలో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే క్యాంపస్‌ను తాత్కాలికంగా లాక్‌డౌన్ చేశారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన వారికి ప్రాణాపాయం లేదని యూనివర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ఘటన విద్యార్థుల్లో ఆందోళన నింపింది. కాగా, కొద్ది రోజుల క్రితం బుధవారం జార్జియాలోని ఓ హైస్కూల్‌లో జరిగిన కాల్పుల్లో ఇద్దరు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో పోలీసులు ఒక అనుమానితుడిని అదుపులోకి తీసుకున్నారు. వరుసగా విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో జరుగుతున్న ఈ కాల్పుల ఘటనలు అమెరికాలో తుపాకీ నియంత్రణ చట్టాలపై చర్చను మరోసారి తెరపైకి తెచ్చాయి.

## చంద్రగిరిలో ఏనుగుల బీభత్సం.. రంగంలోకి దిగిన పవన్ కల్యాణ్

మొదటిపేజీ తరువాయి – తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఏనుగులు రాత్రివేళల్లో పంట పొలాలపై పడి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఈ విషయంపై స్పందించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కల్యాణ్, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని, ఇందుకోసం ఆధునిక టెక్నాలజీని వినియోగించుకోవాలని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల సంచార మార్గాలను గుర్తించి, ఆ సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమీప గ్రామాల ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించేందుకు అటవీ, రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా అటవీ సరిహద్దు గ్రామాల్లో రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీ బృందాలను ఏర్పాటు చేసి, ప్రజలు పొలాల వద్దకు వెళ్లకుండా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. స్థానిక సమాచార వ్యవస్థలు, మైకులు, మొబైల్ సందేశాల ద్వారా ప్రజలను నిరంతరం అప్రమత్తం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడం మన ప్రథమ కర్తవ్యం. ఏనుగుల వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. క్షేత్రస్థాయి సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ పరిస్థితిని సమీక్షించాలి. అవసరమైతే, ప్రజల భద్రత కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన 'హనుమాన్' (హెచ్.యు.ఎం.ఎ.ఎన్ ... Healing and Nurturing Units for Monitoring, Aid and Nursing of Wildlife ) బృందాలను సమస్యాత్మక ప్రాంతాల్లో మోహరించాలి" అని అధికారులకు స్పష్టం చేశారు. ఏనుగుల దాడుల్లో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని పవన్ కల్యాణ్ భరోసా ఇచ్చారు. పంట నష్టంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు రూపొందించిన వెంటనే, అటవీశాఖ నిబంధనల ప్రకారం బాధితులకు తక్షణమే పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా భయాందోళనలకు గురికాకుండా, ధైర్యంగా ఉంటూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, ఏనుగులు కనిపించిన వెంటనే అటవీశాఖ సిబ్బందికి సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో అటవీశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు ముమ్మరం చేశారు.

## సీఎం క్యాంప్ ఆఫీసులో మహిళలకు 'హై టీ'





మొదటిపేజీ తరువాయి – ముఖాముఖిగా మాట్లాడారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం ప్రవేశపెట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం "స్త్రీ శక్తికి సంవత్సరం – రెట్టింపైన ఆత్మగౌరవం" పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ నుంచి నేరుగా మహిళలతో కలిసి ఓ పల్లె వెలుగు బస్సులో క్యాంప్ కార్యాలయం వరకు ప్రయాణించారు. ప్రయాణంలో వారితో మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళలతో ఏర్పాటు చేసిన తేనీటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ, వారి కుటుంబ వివరాలు, ఆర్థిక పరిస్థితులు, పథకం ద్వారా కలుగుతున్న ప్రయోజనాలను ఆరా తీశారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం మహిళలకు సూచించారు. ఎన్నికల సమయంలో కొందరు పెట్టే ప్రలోభాలకు గురికావద్దని, అలాంటి వాటికి వ్యతిరేకంగా



మహిళలే ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాబోయే పదేళ్లలో మీ లక్ష్యాలు ఏమిటని ఆయన ప్రశ్నించగా, మహిళల నుంచి స్ఫూర్తిదాయకమైన సమాధానాలు వచ్చాయి. కడపకు చెందిన ఓ ముస్లిం మహిళ తన డ్వాక్రా సంఘం ద్వారా రూ. కోటి పెట్టుబడితో వ్యాపారం చేయాలనేది తన లక్ష్యమని చెప్పగా, విశాఖకు చెందిన ఉద్యోగిని ఏఐ రంగంలో నైపుణ్యం సాధించి ఉన్నత స్థాయికి వెళ్లాలని ఉందని వివరించారు. 'స్త్రీ శక్తి' పథకం వల్ల తమకు నెలకు సుమారు రూ. 3 వేలు ఆదా అవుతున్నాయని కొందరు యువతులు తెలిపారు. ప్రభుత్వ పథకాలతో తాము ఆర్థికంగా బలపడి, మరికొందరికి ఉపాధి కూడా చూపగలుగుతున్నామని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కాకినాడకు చెందిన ఓ మత్స్యకార మహిళ మాట్లాడుతూ, ఉచిత ప్రయాణం వల్ల చేపల విక్రయాలకు వివిధ ప్రాంతాలకు సులువుగా వెళ్లగలుగుతున్నానని, నెలకు సుమారు రూ.4,000 ఆదా అవుతోందని వివరించారు. ఆ డబ్బుతో తన ఆరోగ్య అవసరాలు తీరుతున్నాయని తెలిపారు. నంద్యాలకు చెందిన మరో మహిళ మాట్లాడుతూ, స్త్రీ శక్తితో పాటు ఇతర పథకాల ద్వారా తాను లబ్ధి పొందుతున్నానని, నెలకు రూ.1,500 వరకు ఆదా చేస్తున్నానని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన చేనేత మహిళ మాట్లాడుతూ, ముడిసరుకు కొనుగోలుకు, నేసిన చీరలను మార్కెట్లకు తరలించడానికి ఉచిత బస్సు ప్రయాణం ఎంతగానో ఉపయోగపడుతోందని అన్నారు. గతంలో తన భర్త ఒక్కరే వ్యాపారం చూసుకునేవారని, ఇప్పుడు తాను కూడా బయటకు వెళ్లి వ్యాపారాన్ని విస్తరించగలుగుతున్నానని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తాము ఆర్థికంగా ఎదగడమే కాకుండా, మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకున్నామని పలువురు మహిళలు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా, అమరావతి నిర్మాణాలను చూడాలని ఉందని వారు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. వెంటనే వారి కోసం రాజధాని పర్యటనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

## నెహ్రూ, ఇందిరలను దాటేసిన మోదీ... ఎర్రకోట ప్రసంగాల్లో రికార్డ్



మొదటిపేజీ తరువాయి – ప్రసంగించిన నేతగా ఆయన నిలిచారు. ప్రసంగాల సంఖ్య తక్కువగా ఉన్నప్పటికీ, మొత్తం ప్రసంగ సమయం పరంగా మాజీ ప్రధానులందరి కంటే ఆయన ముందంజలో ఉండటం విశేషం. ప్రధాని మోదీ ఇప్పటివరకు 13 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగాల్లో ద్వారా మొత్తం 1,177 నిమిషాలు పాటు ప్రసంగించారు. ఇదే క్రమంలో, 16 ప్రసంగాల్లో ఇందిరా గాంధీ 504 నిమిషాలు, 10 ప్రసంగాల్లో మన్మోహన్ సింగ్ 417 నిమిషాలు, 17 ప్రసంగాల్లో జవహర్‌లాల్ నెహ్రూ 400 నిమిషాలు మాత్రమే ప్రసంగించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ, ఇందిరా గాంధీల కంటే మోదీ తక్కువ సార్లు ప్రసంగించినప్పటికీ, వారిద్దరి మొత్తం ప్రసంగ సమయం కంటే రెట్టింపునకు పైగా మాట్లాడారు. మౌలిక సదుపాయాలు, డిజిటల్ కార్యక్రమాలు, మహిళా సాధికారత, యువతకు అవకాశాలు, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యం సాధన వంటి అంశాలపై ప్రభుత్వ విజయాలను, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు వివరంగా తెలియజేయడానికే ప్రధాని నరేంద్ర మోదీ సుదీర్ఘ ప్రసంగాలకు ప్రాధాన్యతనిచ్చారు.

## సీఎం విజయ్ తల్లిపై నైనార్ నాగేంద్రన్ వివాదాస్పద వ్యాఖ్యలు



మొదటిపేజీ తరువాయి – నాగేంద్రన్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపాయి. డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్‌ను ఉద్దేశించి "మీ నాన్న ఎక్కడ?" అంటూ అసెంబ్లీలో విజయ్ చేసిన విమర్శలపై స్పందిస్తూ నైనార్ నాగేంద్రన్ ఈ అనుచిత వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో 'తండ్రి' కోసం వెతకడం కాకుండా, ఇంట్లో ఉన్న తల్లిని అడిగితేనే తండ్రి ఎవరో తెలుస్తుందంటూ నాగేంద్రన్ వ్యాఖ్యానించారు. ఈ తరహా వ్యాఖ్యలపై టీవీకే వర్గాలు తీవ్రంగా మండిపడ్డాయి. నైనార్ నాగేంద్రన్ ఒక బాధ్యతాయుతమైన నాయకుడిగా కాకుండా వీధి చివర మాట్లాడే వ్యక్తిలా మాట్లాడారని విద్యాశాఖ మంత్రి రాజమోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన తన పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడుకుంటూ మాట్లాడాలని హితవు పలికారు. ఈ వివాదంపై బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా తీవ్రంగా స్పందించారు. నైనార్ నాగేంద్రన్ రాజకీయ సంస్కృతి, ఎల్లలను దాటి మాట్లాడారని ఆయన ఖండించారు. తమిళనాడు రాజకీయాన్ని ఈ స్థాయిలో దిగజార్చడం అత్యంత విచారకరమని, విజయ్ తల్లిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలను ఎంతమాత్రం అంగీకరించలేమని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. విధానపరమైన వ్యత్యాసాలు, ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ... కుటుంబ సభ్యులను, ముఖ్యంగా తల్లిని లాగి మాట్లాడడం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు.

## నేను గర్వపడే 'దిమాగీ నక్సల్'ను: మోదీకి చిదంబరం కౌంటర్



మొదటిపేజీ తరువాయి – నక్సలిజం) వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగింది. ప్రధాని వ్యాఖ్యలకు కౌంటర్‌గా, తాను 'గర్వపడే దిమాగీ నక్సల్' అని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం ప్రకటించారు. ప్రధాని చేసిన వ్యాఖ్యల అనంతరం ఆదివారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించారు. "నేను గర్వపడే దిమాగీ నక్సల్‌ను!" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. శనివారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై నుంచి జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ, దేశంలో సాయుధ నక్సలిజాన్ని బలహీనపరచడంలో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. అయితే, 'దిమాగీ నక్సలిజం' రూపంలో ఒక కొత్త సవాల్ పొంచి ఉందని హెచ్చరించారు. "అడవుల్లో సాయుధ నక్సల్స్‌ను మనం వదిలించుకున్నాం. కానీ హింస, అశాంతిని సృష్టించడానికి 'దిమాగీ నక్సల్స్' అవకాశాల కోసం చూస్తున్నారు. వారు సమాజాన్ని తప్పుదోవ పట్టించాలనుకుంటున్నారు. ఈ 'దిమాగీ నక్సల్స్'ను గుర్తించి, వారిని ఏకాకులను చేయాలి. యువతను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావాలి" అని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రధాని వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. రాజకీయ ప్రత్యర్థులపై ప్రధాని మోదీ రెచ్చగొట్టే పదజాలాన్ని వాడుతున్నారని, ఇది ఆయనలోని రాజకీయ నిస్పృహను ప్రతిబింబిస్తోందని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ప్రధాని వ్యాఖ్యలను తప్పుబట్టారు. గతంలో ఆయన ఉపయోగించిన 'అర్బన్ నక్సల్స్' పదాన్ని గుర్తుచేశారు. "మొదట ఆయన తన ప్రత్యర్థులను 'అర్బన్ నక్సల్స్' అన్నారు. ఇప్పుడు 'దిమాగీ నక్సల్స్' అంటున్నారు. ఇది ఆయన నిరాశకు స్పష్టమైన సంకేతం" అని జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అంతేకాకుండా, 'అర్బన్ నక్సల్స్' లేదా 'దిమాగీ నక్సల్స్' అని ముద్ర వేసిన వారు డిమాండ్ చేసిన అనేక అంశాలను చివరికి ప్రధాని మోదీయే అమలు చేస్తుంటారని ఆయన ఆరోపించారు.

## ఒకవైపు సైనిక విన్యాసాలు మరోవైపు కిమ్‌తో స్నేహమంటున్న ట్రంప్



మొదటిపేజీ తరువాయి – ఒక పాత ఫొటోను పంచుకుని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ ఫొటోలో మేమిద్దరం సీరియస్‌గా కనబడుతున్నప్పటికీ, మేం నవ్వుతూ దిగిన ఫొటోలు చాలా ఉన్నాయి. కిమ్ జాంగ్ ఉన్, నేను చాలా గొప్పగా కలిసిపోతాం!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేసిన సమయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకవైపు ఆయన కిమ్‌తో స్నేహాన్ని గుర్తుచేసుకుంటుండగా, మరోవైపు కొరియా ద్వీపకల్పంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికా, దక్షిణ కొరియాలు కలిసి నిర్వహించనున్న సైనిక విన్యాసాలపై ఉత్తర కొరియా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. 'ఉల్చీ ఫ్రీడమ్ షీల్డ్' పేరుతో ఆగస్టు 17 నుంచి 27 వరకు ఈ సైనిక విన్యాసాలు జరగనున్నాయి. డ్రోన్లు, జీపీఎస్ జామింగ్, సైబర్‌టాక్స్‌ను ఎదుర్కోవడం వంటి ఆధునిక యుద్ధ తంత్రాలపై ఇందులో శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విన్యాసాలపై ఉత్తర కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. అమెరికా–జపాన్–దక్షిణ కొరియా సైనిక సహకారం ఒక 'అణు కూటమి'గా మారుతోందని ఆరోపించింది. అల్ జజీరా కథనం ప్రకారం.. "కొత్త స్థాయి ముప్పును తాము కొత్త స్థాయి నిరోధక శక్తితో ఎదుర్కొంటామని" ఉత్తర కొరియా అధికారిక వార్తా సంస్థ కేసీఎన్ఏ ద్వారా హెచ్చరించింది. గత ఐదేళ్లలో జరిగిన విన్యాసాల కంటే ఇవి భిన్నమైనవని, ఆధునిక యుద్ధ నైపుణ్యాలను మెరుగుపరిచేందుకే వీటిని నిర్వహిస్తున్నారని ప్యాంగ్యాంగ్ ఆరోపించింది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే ప్రతిస్పందించడం తమ ప్రాథమిక సూత్రమని స్పష్టం చేసింది. ఈ హెచ్చరికల నేపథ్యంలోనే ఆగస్టు 12న ఉత్తర కొరియా ఒక బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడం గమనార్హం. ఒకవైపు ట్రంప్ పాత స్నేహాన్ని గుర్తుచేసుకుంటుంటే, కొరియా ద్వీపకల్పంలో మాత్రం యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

# యోగం అర్థం తెలుసా?

**శరీరం--మనసును ఏకం చేసే ఒక జీవన విధానం**

**ఐదు వేల ఏళ్లకు పైగా భారతీయ వారసత్వం..**

**నేటి ఒత్తిడి జీవితానికి యోగమే ఓ మార్గం**

**సంపాదకీయ వ్యాసం :**




**రామంతపూర్, ఆగస్టు 16 నిజం న్యూస్:** ఆధునిక జీవితం పరుగులు పెడుతోంది. ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ఉరుకులు, పరుగులే. చదువు, ఉద్యోగం, వ్యాపారం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక ఒత్తిళ్లు, పోటీ ప్రపంచం... ఇవన్నీ మనిషి జీవితంలో భాగమైపోయాయి. సాంకేతికత అందుబాటులోకి వచ్చిన కొద్దీ జీవితం సౌకర్యవంతమవుతున్నప్పటికీ, మరోవైపు శారీరక శ్రమ తగ్గిపోవడం, మానసిక ఒత్తిడి పెరగడం, నిద్రకు ప్రాధాన్యం తగ్గడం వంటి పరిణామాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచం మొత్తం భారతదేశం వైపు చూస్తున్న గొప్ప జీవన విధానాల్లో యోగం ఒకటి. యోగం అంటే కేవలం శరీరాన్ని వంచడం, కొన్ని ఆసనాలు వేయడం మాత్రమే కాదు. శరీరం, శ్వాస, మనసు మధ్య సమన్వయాన్ని ఏర్పరచే సమగ్ర సాధన. అందుకే యోగాన్ని ఒక వ్యాయామంగా మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానంగా చూడాల్సిన అవసరం ఉంది.

### 'యోగ' అంటే ఏమిటి?

'యోగ' అనే పదం సంస్కృతంలోని 'యుజ్' అనే ధాతువు నుంచి వచ్చిందని చెబుతారు. యుజ్ అంటే కలపడం, ఏకం చేయడం. శరీరం--మనసు మధ్య సమన్వయం, వ్యక్తి అంతరంగంతో అనుసంధానం అనే విస్తృత భావన యోగంలో కనిపిస్తుంది. భారతీయ తత్వశాస్త్రంలో యోగానికి ఎంతో ప్రాచీనమైన స్థానం ఉంది. వేల సంవత్సరాలుగా భారతీయ ఆధ్యాత్మిక, తాత్విక సంప్రదాయాల్లో యోగ సాధనకు ప్రాధాన్యం ఉంది. కాలానుగుణంగా యోగం వివిధ రూపాల్లో అభివృద్ధి చెంది నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రజల జీవనశైలిలో భాగమవుతోంది.

### ఆసనమే యోగం కాదు!

నేటి తరంలో యోగం అంటే కొన్ని ఆసనాలు వేయడం అనే భావన ఎక్కువగా కనిపిస్తోంది. కానీ యోగం అంతకంటే విస్తృతమైనది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే ఆసనాలతో పాటు శ్వాసపై నియంత్రణకు ప్రాధాన్యమిచ్చే ప్రాణాయామం, మనస్సును ప్రశాంతంగా ఉంచే ధ్యానం వంటి సాధనలు కూడా యోగ సంప్రదాయంలో ముఖ్యమైనవే. శరీరానికి వ్యాయామం ఎంత అవసరమో, మనసుకు విశ్రాంతి కూడా అంతే అవసరం. శరీరానికి మాత్రమే శ్రమనిచ్చి మనసుకు విశ్రాంతి ఇవ్వకపోతే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం కాదు. ఈ సమతుల్యతను ఏర్పరచడంలో యోగం కీలక పాత్ర పోషిస్తుంది.

### పరుగులు తీస్తున్న జీవితానికి ప్రశాంతత అవసరం

ప్రస్తుత కాలంలో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనేకమంది ఒత్తిడితో జీవిస్తున్నారు. విద్యార్థులకు చదువు, పరీక్షలు, పోటీలు ఒత్తిడిని కలిగిస్తుంటే.. ఉద్యోగులకు పని ఒత్తిడి, లక్ష్యాలు, సమయాభావం సవాళ్లుగా మారుతున్నాయి. వృద్ధుల్లో ఒంటరితనం, జీవనశైలి మార్పులు ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి సమయంలో రోజులో కొంత సమయాన్ని యోగ సాధన, శ్వాసాభ్యాసం, ధ్యానానికి కేటాయించడం మనసుకు ప్రశాంతతను కలిగించడంలో సహాయపడుతుంది. మనసును ఒకచోట నిలిపి, ఆలోచనలను క్రమబద్ధీకరించుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

### శారీరక ఆరోగ్యానికి తోడ్పాటు

యోగాసనాలు శరీరంలోని వివిధ కండరాలు, కీళ్ల కదలికలకు అనుగుణంగా ఉంటాయి. క్రమం తప్పకుండా, సరైన పద్ధతిలో సాధన చేస్తే శరీర వశ్యత, సమతుల్యత, శారీరక చురుకుదనం మెరుగుపడేందుకు సహాయపడవచ్చు. అయితే ప్రతి ఆసనం ప్రతి ఒక్కరికీ ఒకే విధంగా సరిపోదు. వయస్సు, శారీరక పరిస్థితి, గతంలో ఉన్న గాయాలు, ఇతర ఆరోగ్య సమస్యలను పరిగణనలోకి తీసుకుని సాధన చేయాలి. ముఖ్యంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్నవారు నిపుణుల సూచనతో యోగాన్ని ప్రారంభించడం ఉత్తమం.

### శ్వాసపై నియంత్రణ.. మనసుపై ప్రభావం

మనిషి భావోద్వేగాలకు శ్వాసకు సంబంధం ఉంది. కోపం వచ్చినప్పుడు శ్వాస వేగం పెరుగుతుంది. భయం కలిగినప్పుడు శ్వాసలో మార్పులు కనిపిస్తాయి. ప్రశాంతంగా ఉన్నప్పుడు శ్వాస సహజంగా, స్థిరంగా ఉంటుంది. ప్రాణాయామం వంటి శ్వాసాభ్యాసాలు శ్వాసపై అవగాహన, నియంత్రణ పెంచేందుకు ఉపయోగపడతాయి. అయితే ప్రాణాయామాన్ని కూడా సరైన విధంగా నేర్చుకోవాలి. శ్వాసను బలవంతంగా ఆపడం, అత్యధికంగా శ్వాసాభ్యాసాలు చేయడం వంటి ప్రయోగాలు స్వయంగా చేయడం మంచిది కాదు.

### నిద్రకు కూడా మేలు

నేటి జీవనశైలిలో నిద్రలేమి పెద్ద సమస్యగా మారుతోంది. రాత్రి వేళల్లో మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టెలివిజన్ వినియోగం, పని ఒత్తిడి, ఆందోళన వంటి కారణాలతో చాలామంది తగినంత నిద్రపోవడం లేదు. రోజువారీ జీవనంలో యోగం, ధ్యానం వంటి ప్రశాంతమైన సాధనలను చేర్చుకోవడం నిద్రకు ముందు మనసును ప్రశాంతంగా చేసుకోవడంలో సహాయపడవచ్చు. అయితే నిద్ర సమస్యలకు యోగమే పూర్తి పరిష్కారం అని భావించకూడదు. నిరంతర నిద్ర సమస్యలు ఉంటే వైద్య నిపుణుల సలహా తీసుకోవాలి.

### విద్యార్థులకు యోగం ఎందుకు?

నేటి విద్యార్థుల జీవితం కూడా తీవ్రమైన పోటీతో నిండి ఉంది. పరీక్షలు, ర్యాంకులు, భవిష్యత్తుపై ఆందోళనలు వారి మానసిక ప్రశాంతతను ప్రభావితం చేస్తున్నాయి. పాఠశాలల్లో విద్యతో పాటు శారీరక వ్యాయామం, క్రీడలు, యోగం, ధ్యానానికి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉంది. యోగ సాధన ద్వారా ఏకాగ్రత, శరీర చురుకుదనం, ప్రశాంతత వంటి అంశాలకు తోడ్పాటు లభించవచ్చు. ముఖ్యంగా పిల్లలకు కఠినమైన సాధనలకంటే వయస్సుకు అనుగుణమైన సులభమైన ఆసనాలు, శ్వాసాభ్యాసాలు, విశ్రాంతి పద్ధతులను నిపుణుల మార్గదర్శకత్వంలో నేర్పాలి.

### మధుమేహం, గుండె ఆరోగ్యం.. జాగ్రత్తగా సాధన

మధుమేహం లేదా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారికి శారీరక చురుకుదనం అవసరమే. అయితే యోగం ఏ వ్యాధికైనా ప్రత్యామ్నాయ చికిత్స అని భావించడం సరికాదు. వైద్యులు సూచించే మందులు, ఆహార నియమాలు, వ్యాయామం, వైద్య పరీక్షలను కొనసాగిస్తూనే, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా యోగాన్ని అనుబంధ సాధనగా ఉపయోగించవచ్చు. ముఖ్యంగా గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు తీవ్రమైన ఆసనాలు లేదా శ్వాసాభ్యాసాలను స్వయంగా ప్రారంభించకుండా వైద్యులు, శిక్షణ పొందిన యోగా నిపుణుల సలహా తీసుకోవాలి. యోగం ఆరోగ్యానికి తోడ్పడాలి కానీ వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయంగా మారకూడదు.

### మహిళలకు, వృద్ధులకు కూడా ఉపయోగకరం

మహిళలు కుటుంబం, ఉద్యోగం, పిల్లల బాధ్యతలు వంటి అనేక పనులను నిర్వహిస్తూ తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే పరిస్థితులు కనిపిస్తుంటాయి. వృద్ధుల్లో శారీరక కదలిక తగ్గడం మరో సమస్య. వయస్సు, శారీరక సామర్థ్యానికి అనుగుణంగా సరళమైన యోగాసనాలు, శ్వాసాభ్యాసాలు, ధ్యానం చేయడం శరీరాన్ని చురుకుగా ఉంచుకోవడానికి తోడ్పడవచ్చు. అయితే వృద్ధులు లేదా ఇతర ఆరోగ్య సమస్యలున్నవారు నేలపై కూర్చోవడం, నిలబడడం, శరీరాన్ని ఎక్కువగా వంచడం వంటి ఆసనాల్లో జాగ్రత్తలు పాటించాలి. అవసరమైతే కుర్చీ ఆధారంగా చేసే యోగా వంటి సురక్షిత పద్ధతులను నిపుణుల సహాయంతో ఎంచుకోవచ్చు.

### యోగం మార్కెట్ వస్తువుగా మారకూడదు

ప్రపంచవ్యాప్తంగా యోగానికి ఆదరణ పెరగడం మంచి పరిణామమే. కానీ అదే సమయంలో యోగం పేరుతో శాస్త్రీయ ఆధారం లేని వాదనలు, అద్భుత ఫలితాల ప్రచారం, ప్రతి వ్యాధిని నయం చేస్తామనే ప్రకటనలు పెరగడం ఆందోళన కలిగించే అంశం. యోగాన్ని ఆరోగ్యకరమైన జీవనశైలిలో ఒక భాగంగా స్వీకరించాలి. యోగం చేస్తే అన్ని వ్యాధులు నయమవుతాయి, మందులు అవసరం లేదు, వైద్యులను సంప్రదించాల్సిన అవసరం లేదు అనే ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించవచ్చు. యోగం పట్ల విశ్వాసం ఉండాలి.. కానీ మూఢనమ్మకం మాత్రం ఉండకూడదు.

### ప్రజారోగ్యంలో యోగానికి స్థానం కల్పించాలి

ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడంలో నివారణకు ప్రాధాన్యం పెరగాలి. వ్యాధి వచ్చిన తర్వాత చికిత్స చేయడం మాత్రమే కాకుండా, ఆరోగ్యకరమైన జీవనశైలిని చిన్న వయస్సు నుంచే అలవాటు చేయడం అవసరం. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, వృద్ధుల కేంద్రాలు, ప్రజా ఉద్యానవనాల్లో యోగం, ధ్యానం, శారీరక వ్యాయామాలకు అనుకూలమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలి. అయితే శిక్షణ పొందిన నిపుణుల పర్యవేక్షణ, భద్రతా ప్రమాణాలు కూడా ఉండాలి.

### ఉదయం అరగంట.. జీవితానికి ఆరోగ్య బాట

ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ గంటల తరబడి సమయం కేటాయించాల్సిన అవసరం లేదనే అవగాహన పెరగాలి. వ్యక్తిగత సామర్థ్యాన్ని బట్టి కొంత సమయాన్ని శారీరక వ్యాయామం, యోగం, శ్వాసాభ్యాసం, ధ్యానానికి కేటాయించడం మంచి అలవాటుగా మారాలి. అదే సమయంలో యోగంతో పాటు సమతుల్య ఆహారం, తగిన నిద్ర, నిత్య శారీరక కదలిక, పొగాకు--మద్యపానానికి దూరంగా ఉండటం, అవసరమైన వైద్య పరీక్షలు కూడా ఆరోగ్యకరమైన జీవితంలో భాగాలే.

### మన వారసత్వాన్ని ప్రపంచం స్వీకరిస్తోంది.. మనం మాత్రం?

భారతదేశంలో వేల సంవత్సరాలుగా అభివృద్ధి చెందిన యోగ సాధన నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందుతోంది. ప్రపంచం యోగం వైపు చూస్తున్నప్పుడు మనం మాత్రం దాని విలువను కేవలం ఒక ప్రత్యేక దినోత్సవానికే పరిమితం చేయకూడదు. యోగ దినోత్సవం రోజున మాత్రమే ఆసనాలు వేసి, మరుసటి రోజు పాత జీవనశైలికి తిరిగి వెళ్లడం వల్ల ప్రయోజనం పరిమితంగానే ఉంటుంది. యోగం ఒకరోజు కార్యక్రమం కాదు.. ప్రతిరోజూ పాటించగల ఆరోగ్యకరమైన అలవాటు.

### సంపాదకీయం

ఆరోగ్యం కోల్పోయిన తర్వాత ఆసుపత్రుల చుట్టూ తిరగడం కంటే, ఆరోగ్యంగా ఉన్నప్పుడే దాన్ని కాపాడుకోవడం ఉత్తమం. ఆధునిక వైద్యం అవసరమే. అదే సమయంలో వ్యాధులను నివారించే జీవనశైలికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. యోగం ఈ దిశగా ఉపయోగపడే ఒక సాధనం. కానీ యోగాన్ని అతి చేసి ప్రచారం చేయకూడదు. శాస్త్రీయ దృక్పథంతో, నిపుణుల మార్గదర్శకత్వంతో, వ్యక్తిగత శారీరక పరిస్థితులకు అనుగుణంగా సాధన చేయాలి. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ తమకు సరిపోయే విధానాన్ని ఎంచుకోవాలి. శరీరాన్ని బలపరచడం మాత్రమే కాదు.. మనసును ప్రశాంతంగా ఉంచడం కూడా ఆరోగ్యమే. శ్వాసను గమనించడం మాత్రమే కాదు.. జీవితాన్ని కూడా గమనించడం యోగం నేర్పే సందేశం. అందుకే యోగాన్ని ఒక వ్యాయామంగా కాకుండా శరీరం--మనసు--శ్వాస మధ్య సమతుల్యతను పెంపొందించే జీవన విధానంగా స్వీకరించాలి. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో యోగానికి తగిన స్థానం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆరోగ్యమే మహాభాగ్యం.. యోగమే ఆరోగ్య జీవనానికి ఓ మంచి తోడ్పాటు!

## హుజురాబాద్‌లో సురక్ష హాస్పిటల్‌లో గైనిక్, సర్జరీ విభాగాలు ప్రారంభం



**హుజురాబాద్, ఆగస్టు 16 నిజం న్యూస్:** పట్టణంలోని సురక్ష హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గైనిక్ మరియు సర్జరీ విభాగాలను కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు ఆధునిక సౌకర్యాలతో గైనిక్, సర్జరీ విభాగాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. స్థానిక ప్రజలు ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైద్య సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సచిన్ సావంత్‌కు ఘన సన్మానం



**కరీంనగర్, ఆగస్టు 16 నిజం న్యూస్:** కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి విచ్చేసిన ఏఐసీసీ సెక్రెటరీ, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి సచిన్ సావంత్‌ను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ఘనంగా సన్మానించారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశానికి సచిన్ సావంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో పార్టీ బలోపేతం, రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, మహిళా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్న రెడ్డి, చొప్పదండి మున్సిపల్ చైర్‌పర్సన్ సరితతో పాటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## ఇల్లందకుంటలో నూతన పెట్రోల్, డీజిల్ పంపు ప్రారంభం



**ఇల్లందకుంట, ఆగస్టు 16 నిజం న్యూస్:** మండల కేంద్రంలో ధార శివరంజని--సదానందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజరాజేశ్వర ఎనర్జీ హబ్ నూతన పెట్రోల్, డీజిల్ పంపును హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు, వాహనదారులకు మెరుగైన సేవలు అందించేలా పెట్రోల్ బంక్ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన సేవలను అందిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అడిషనల్ డీఎస్పీ రాం నరసింహారెడ్డి, ఇల్లందకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెద్ది కుమార్, ఇల్లందకుంట దేవస్థాన చైర్మన్ రామారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ కొంరెల్లి, మండల అధ్యక్షురాలు రజిత, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రంథాలయం, ఇన్‌చార్జిపై అవాస్తవ ప్రచారం తగదు

**వాస్తవాలను నిర్ధారించుకోకుండా వార్తలు ప్రచురించడం**

**బాధాకరం: గ్రంథాలయ ఇన్‌చార్జి రాపాల లక్ష్మీనారాయణ**



**నల్లబెల్లి ఆగస్టు 16 నిజం న్యూస్:** మండల కేంద్రంలోని గ్రంథాలయానికి, తనపై ఇటీవల ప్రచారంలోకి వచ్చిన కొన్ని వార్తలు పూర్తిగా వాస్తవాలను ప్రతిబింబించేవి కావని గ్రంథాలయ ఇన్‌చార్జి రాపాల లక్ష్మీనారాయణ తెలిపారు. పూర్తి వివరాలు తెలుసుకోకుండా, ఒక ఘటనను ఆధారంగా చేసుకుని గ్రంథాలయ నిర్వహణపై అపోహలు కలిగించే విధంగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. గ్రంథాలయంలో విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునేందుకు అవసరమైన వాతావరణం కల్పించడమే తమ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. గ్రంథాలయానికి సంబంధించిన ఫోటోలు, చిత్రాలను సక్రమంగా గోడ పక్కన ఉంచాలని ఓ విద్యార్థికి సూచించగా, విద్యార్థి వాటిని తీసుకొచ్చి ఉంచిన అనంతరం టీ తాగేందుకు బయటకు వెళ్లాడని చెప్పారు. ఆ సమయంలో కొన్ని ఫోటోలు కిందపడిన ఘటన చోటుచేసుకుందని వివరించారు. అయితే ఈ చిన్న ఘటనకు వాస్తవాలకు భిన్నమైన అంశాలను జోడించి, బొట్ల నరేష్ అనే వ్యక్తి ఫోటోలు తీసి పీడీఎఫ్ పేపర్‌లో గ్రంథాలయం, తనపై అవాస్తవ ఆరోపణలతో వార్త ప్రచురించడం సమంజసం కాదన్నారు. ఏదైనా వార్త ప్రచురించే ముందు సంబంధిత వ్యక్తులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవడం బాధ్యతాయుతమైన జర్నలిజంలో భాగమని పేర్కొన్నారు. గ్రంథాలయానికి సంబంధం లేని విషయాలను ప్రస్తావిస్తూ, తనపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు చేయడం కూడా పూర్తిగా అవాస్తవమని రాపాల లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. ఇలాంటి నిరాధార ప్రచారం వల్ల గ్రంథాలయానికి వస్తున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో అనవసరమైన అపోహలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. గ్రంథాలయం విద్యార్థులకు ఉపయోగపడే విజ్ఞాన కేంద్రంగా కొనసాగాలని, దాని ప్రతిష్టను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఇకనైనా సంబంధిత వ్యక్తులు వాస్తవాలను తెలుసుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిరాధార ఆరోపణలు, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాపాల లక్ష్మీనారాయణకు మద్దతుగా ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షులు పరికిరత్నం, గాదం సురేష్, జంపయ్య, కనకం శ్రీకాంత్, త్రికోవెల శ్రీకాంత్ తదితరులు మాట్లాడుతూ గ్రంథాలయ ప్రతిష్టకు భంగం కలిగించేలా అవాస్తవ ప్రచారం చేయడం సరికాదన్నారు. వాస్తవాలను నిర్ధారించుకున్న తర్వాతే వార్తలు ప్రచురించాలని వారు సూచించారు.

## మనిషిని ఏఐ ప్రేమించగలదా?

**భావోద్వేగాలను అనుకరించగలదు.**

**అనుభవించలేదు: నిపుణులు**

**ఏఐతో పెరుగుతున్న భావోద్వేగ బంధాలు..**

**భవిష్యత్తులో ప్రభావాలపై పరిశోధనలు**



**నాగోల్, ఆగస్టు 16 నిజం న్యూస్:** కృత్రిమ మేధ (ఏఐ) మనిషిలా మాట్లాడుతోంది.. కవితలు రాస్తోంది.. ప్రేమగా పలకరిస్తోంది.. మన భావాలను అర్థం చేసుకున్నట్లుగా స్పందిస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా కొందరు వినియోగదారులు ఏఐ చాట్‌బాట్‌లతో భావోద్వేగ అనుబంధాన్ని పెంచుకుంటున్నారు. అయితే ఏఐ నిజంగా మనిషిని ప్రేమించగలదా? అనే ప్రశ్నకు ప్రస్తుతానికి సమాధానం 'లేదు' అంటున్నారు నిపుణులు. చాట్‌బాట్‌లు ప్రేమ, ఆప్యాయత, సానుభూతి వంటి భావాలను వ్యక్తం చేస్తున్నట్లు కనిపించినా.. అవి నిజంగా వాటిని అనుభవించడం లేదని పరిశోధకులు చెబుతున్నారు. మనుషులతో సహజంగా సంభాషించేలా రూపొందించిన అల్గారిథమ్‌లు, భాషా నమూనాల ఆధారంగానే అవి స్పందిస్తాయని వివరిస్తున్నారు. సింగపూర్‌లోని నాన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ పరిశోధకురాలు రెన్వెన్ జాంగ్ అధ్యయనం ప్రకారం.. ఏఐ చాట్‌బాట్‌లతో మాట్లాడే కొందరు వినియోగదారులు వాటితో బలమైన భావోద్వేగ బంధాన్ని ఏర్పరచుకుంటున్నారు. అయితే చాట్‌బాట్ పనిచేయకపోవడం లేదా ఊహించని విధంగా స్పందించినప్పుడు తాము ఒక యంత్రంతోనే మాట్లాడుతున్నామనే వాస్తవం వారికి గుర్తుకొస్తోందని పరిశోధనలు సూచిస్తున్నాయి.

### ప్రేమ వెనుక మెదడు రసాయనాలు

మనుషుల్లో ప్రేమ అనేది కేవలం మాటలకు పరిమితమైన భావన కాదని శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ప్రేమ, ఆకర్షణ, అనుబంధం ఏర్పడటంలో డోపమైన్, ఆక్సిటోసిన్ వంటి మెదడు రసాయనాలతో పాటు జ్ఞాపకాలు, అనుభవాలు, చైతన్యం కీలక పాత్ర పోషిస్తాయి. ప్రస్తుత ఏఐ వ్యవస్థలకు మనుషుల తరహా జీవసంబంధమైన మెదడు ప్రక్రియలు లేదా వ్యక్తిగత అనుభూతులు లేవు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందిన ఏఐ వ్యవస్థలకు చైతన్యం సాధ్యమవుతుందా అనే అంశంపై శాస్త్రవేత్తల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మానవ మెదడు పనితీరును అనుకరించే కొత్త కంప్యూటింగ్ విధానాలపై ఇప్పటికే పరిశోధనలు కొనసాగుతున్నాయి.

### మానవ సంబంధాలపై ప్రభావం!

ఏఐ చాట్‌బాట్‌లు వినియోగదారుల మాటలను శ్రద్ధగా వింటూ, వారికి అనుకూలంగా స్పందించడం వల్ల ఒంటరితనంలో ఉన్న వారికి కొంత ఉపశమనం కలగవచ్చని నిపుణులు చెబుతున్నారు. అదే సమయంలో వాటిపై అతిగా భావోద్వేగపరంగా ఆధారపడితే నిజ జీవితంలోని మానవ సంబంధాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలపై ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఏఐ మన భావాలను అర్థం చేసుకున్నట్లు స్పందించినా.. దానికి నిజమైన ప్రేమ లేదా అనుభూతులు ఉన్నాయని భావించకూడదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతానికి ఏఐ ప్రేమను మాటల్లో అనుకరించగలదే తప్ప.. మనిషిలా ప్రేమను అనుభవించలేదు.

## ఈసారి జీడీపీ 6.4 శాతమే.. భారత్ వృద్ధికి ఫిక్కీ కోతలు

*గతంలో 7 శాతంగా అంచనా*



ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) భారత జీడీపీ వృద్ధిరేటు 6.4 శాతంగానే ఉండొచ్చని గురువారం దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం ఫిక్కీ ఎకనామిక్ ఔట్‌లుక్ సర్వే అంచనా వేసింది. అంతకుముందు ఇది 7 శాతంగా ఉంటుందని పేర్కొనగా.. ఇప్పుడు అర శాతానికిపైగా కుదించడం గమనార్హం. ఇక 2023-24 దేశ జీడీపీ వృద్ధిరేటు 8.2 శాతం గా ఉన్నది. ఈ క్రమంలో తాజా అంచనా మరింతగా వృద్ధిపై అనుమానాల్ని రేకెత్తిస్తున్నది. గత నెల డిసెంబర్‌లో ప్రముఖ ఆర్థికవేత్తలు, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ నిపుణుల నుంచి సేకరించిన స్పందనలు, అభిప్రాయాల ఆధారంగా ఈ సర్వేను ఫిక్కీ చేపట్టింది.

**ఒడిదొడుకులు**

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై ఎలా ఉంటుందన్న దానిపై నిపుణులు స్పందిస్తూ.. స్వల్ప కాలంలో ఎగుమతులు, విదేశీ పెట్టుబడులు మందగించవచ్చన్నారు. ఇక అధిక సుంకాలు, వీసా నిబంధనలు కూడా కొంత ఇబ్బందికరమేనన్నారు. రూపాయి మారకం విలువ స్థిరత్వాన్ని కోల్పోవచ్చని చెప్తున్నారు. ఇదిలావుంటే వ్యవసాయోత్పత్తి పెంపు, మెరుగైన గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, గిడ్డంగుల వ్యవస్థ బలోపేతం వంటివి ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించగలవని సూచించారు.

## అంచనాలకుమించి రాణించిన ఇన్ఫోసిస్



దేశీయ ఐటీ దిగ్గజాల్లో ఒకటైన ఇన్ఫోసిస్ విశ్లేషకుల అంచనాలకుమించి రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక లాభంలో 11.46 శాతం వృద్ధి నమోదైందని పేర్కొంది. ఐటీ సేవలకు డిమాండ్ ఊపందుకోవడం, వార్షిక విక్రయాల అంచనా మూడోసారి పెంచడం సంస్థకు కలిసొచ్చింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.6806 కోట్ల నికర లాభాన్ని గడించింది. ఏడాది క్రితం ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.6,106 కోట్ల లాభంతో పోలిస్తే రెండంకెల వృద్ధిని సాధించింది. అలాగే ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.6 శాతం అధికమై రూ.41,764 కోట్లుగా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తానికి ఆదాయంలో 4.5-5 శాతం వరకు పెరుగుదలవుండవచ్చునని గైడెన్స్‌లో పేర్కొంది. ఈ సందర్భంగా కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ సలీల్ పరేఖ్ మాట్లాడుతూ..ఆర్థిక సేవలతోపాటు రిటైల్, కన్స్యూమర్ ప్రొడక్ట్స్ రంగంలో మార్పులు అధికంగా చోటు చేసుకుంటున్నాయని, దీంతో ఈ ఏడాది ఆదాయ వృద్ధిలో అంచనాను సవరించినట్లు చెప్పారు. కంపెనీ మొత్తం ఆదాయంలో బీఎఫ్ఎస్ఐ నుంచి మూడోవంతు సమకూరుతున్నదని, అత్యధికంగా సమకూరుతున్న అమెరికాలో 6.1 శాతం వృద్ధిని కనబరిచినట్లు చెప్పారు. గత త్రైమాసికంలో 5,591 మంది ఉద్యోగులు జతయ్యారు. దీంతో మొత్తం సిబ్బంది సంఖ్య 3,23,379కి చేరుకున్నారు. ప్రస్తుతేడాది 15 వేల మంది ఉద్యోగ నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని, వీరితోపాటు 20 వేల మంది ఫ్రెషర్లను సైతం తీసుకోబోతున్నది.

### లాభాల్లో ముగిసిన మార్కెట్లు

## సెన్సెక్స్ 318 పాయింట్లు జంప్



దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో సెషన్‌లో లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలతో మార్కెట్లు లాభాల్లో కొనసాగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్.. 77,319.50 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 76,895.51 పాయింట్ల కనిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యధికంగా 77,319.50 పాయింట్ల గరిష్ఠానికి చేరింది. చివరకు 318.74 పాయింట్లు పెరిగి.. 77,042.82 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 98.60 పెరిగి.. 23,311.80 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 2669 షేర్లు లాభపడ్డాయి. మరో 1,132 షేర్లు నష్టపోయాయి. నిఫ్టీలో అత్యధికంగా లాభపడిన వాటిలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్ ఉన్నాయి. ట్రెంట్, టాటా కన్స్యూమర్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, హెసీఎల్ టెక్, విప్రో నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఒకశాతం, స్మాల్ క్యాప్ ఇండెక్స్ 1.4 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్, ఐటీ, ఎఫ్ఎంసీజీ, ఫార్మా మినహా మిగతా అన్ని రంగాల సూచీలు మెటల్, మీడియా, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, రియాల్టీ, ఆటో 0.5 నుంచి 2.5 శాతం పెరిగాయి.

## మూడో రోజూ లాభాలే 77 వేల మార్క్ దాటిన సెన్సెక్స్



అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, రిటైల్ ద్రవ్యోల్బణం నాలుగు నెలల కనిష్టానికి దిగిరావడంతో పాటు మదుపర్లు కొనుగోళ్లపై దృష్టి పెట్టడంతో సూచీలు వరుస లాభాలను అందుకుంటున్నాయి. ఈ వారంలో తొలి రోజైన సోమవారం భారీ నష్టాలు చవిచూసిన స్టాక్ మార్కెట్లు మంగళవారం నుంచి లాభాల బాట పట్టాయి. ఈ రోజు (గురువారం) కూడా లాభాల్లోనే కదలాడాయి. ఇండెక్స్‌లో హెవీ వెయిట్ షేర్లు లాభపడుతుండడం సూచీలపై సానుకూల ప్రభావం చూపిస్తోంది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల బాటలో సాగుతున్నాయి బుధవారం ముగింపు (76, 724)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు 600 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా లాభాల్లోనే కదలాడింది. 77, 319 వద్ద గరిష్టానికి చేరుకుంది. ఆ తర్వాత కొద్దిగా దిగి వచ్చినప్పటికీ లాభాల్లోనే కొనసాగింది. చివరకు 318 పాయింట్ల లాభంతో 77, 042 వద్ద రోజును ముగించింది. మళ్లీ 77 వేల మార్క్‌ను దాటింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే లాభాలతో రోజును ప్రారంభించింది. చివరకు 98 పాయింట్ల లాభంతో 23, 311 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లో ఎల్ అండ్ టీ టెక్నాలజీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, హెచ్‌ఎఫ్‌సీఎల్, ఇండియన్ బ్యాంక్ షేర్లు లాభాలు అందుకున్నాయి. ఒరాకిల్ ఫిన్‌సెర్వ్, కల్యాణ్ జువెల్లర్, ట్రెంట్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ షేర్లు నష్టాలను మూటగట్టుకున్నాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 584 పాయింట్ల లాభం ఆర్జించింది. బ్యాంక్ నిఫ్టీ 527 పాయింట్ల లాభంతో రోజును ముగించింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 86.55గా ఉంది.

# రిలయన్స్ లాభం 18,540 కోట్లు

# క్యూ3లో 7.4 శాతం పెరిగిన ప్రాఫిట్



దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఆశాజనక పనితీరు కనబరిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికపు నికర లాభంలో 7.4 శాతం వృద్ధి నమోదైనట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. రిటైల్ వ్యాపారంతోపాటు టెలికం విభాగం అంచనాలకుమించి రాణించడం వల్లనే లాభాల్లో ఈ మాత్రమైన వృద్ధిని సాధించింది. అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికానికిగాను సంస్థ రూ.18,540 కోట్లు లేదా ప్రతిషేరుకు రూ.13.70 చొప్పున ఆదాయాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన రూ.17,265 కోట్ల లాభం లేదా ప్రతిషేరుకు రూ.12.76తో పోలిస్తే సింగిల్ డిజిట్ వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2.27 లక్షల కోట్ల నుంచి రూ.2.43 లక్షల కోట్లకు ఎగబాకింది. రూ.3.5 లక్షల కోట్లకు చేరుకున్న రుణాలకోసం సంస్థ అధికంగా చెల్లింపులు జరపడం వల్లనే లాభాలు భారీగా పుంజుకోలేకపోయాయని కంపెనీ పేర్కొంది. సెప్టెంబర్ త్రైమాసికం నాటికి కంపెనీకి రుణాలు రూ.3.36 లక్షల కోట్లు, ఏడాది క్రితం ఇదే త్రైమాసికం నాటికి రూ.3.11 లక్షల కోట్లుగా ఉన్నాయి.

**జియో లాభంలో 24 శాతం వృద్ధి**

దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో మరోసారి భారీ లాభాలను ఆర్జించింది. గత త్రైమాసికపు లాభంలో 24 శాతం వృద్ధిని సాధించింది. 2023-24 ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో రూ.6,231 కోట్లుగా ఉన్న స్టాండలోన్ నికర లాభం గత త్రైమాసికానికిగాను 24.24 శాతం ఎగబాకి రూ.6,477 కోట్లకు చేరుకున్నది. కంపెనీ ఆదాయం రూ.25,368 కోట్ల నుంచి రూ.29,307 కోట్లకు ఎగబాకింది. డాటా వినిమయం ఊపందుకోవడం, సరాసరిగా డాటాపై వచ్చే ఆదాయం పెరగడం వల్లనే ఇది సాధ్యమైందని పేర్కొంది. ప్రస్తుతం సంస్థకు 48.21 కోట్ల మంది వినియోగదారులు ఉన్నారు. సరాసరి ఒక్కో కస్టమర్‌పై రూ.200 ఆదాయం సమకూరింది.

రిలయన్స్ రిటైల్ వెంచర్ లిమిటెడ్ నికర లాభం 10 శాతం వృద్ధితో రూ.3,458 కోట్లు ఆర్జించింది. గత త్రైమాసికంలో కొత్తగా 779 స్టోర్లను ప్రారంభించింది. దీంతో మొత్తం రిటైల్ స్టోర్ల సంఖ్య 19,102కి చేరుకున్నాయి.

గత త్రైమాసికంలో రికార్డు స్థాయి ఎబిటా మార్జిన్లు ఆర్జించినట్లు, నికర లాభంలో కన్సాలిడేటెడ్ స్థాయికి చేరుకున్నది. డిజిటల్ సర్వీసులు, టెలికం సేవలకు కస్టమర్ల నుంచి విశేష స్పందన లావడం కలిసొచ్చింది.

# టైటాన్ బ్యాటరీతో రియల్‌మీ

# 14 సిరీస్ ఫోన్ల ఆవిష్కరణ.. ఇవీ స్పెషిఫికేషన్స్..!



ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ రియల్‌మీ తన రియల్‌మీ 14 సిరీస్ ఫోన్లను ఆవిష్కరించింది. ఇందులో రియల్‌మీ 14 ప్రో 5జీ రియల్‌మీ 14 ప్రో ం 5జీ ఫోన్లు ఉన్నాయి. ఈ ఫోన్లు మూడు రంగుల ఆప్షన్లలో వస్తున్నాయి. గ్రే, కలర్ చేంజింగ్ పెరల్ వైట్ ఫినిష్ , బికనీర్ పర్పుల్ కలర్ ఆప్షన్లలో లభిస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్ 3 చిప్‌సెట్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్ సెట్ బ్యాటరీలతో వస్తున్నాయి. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 50మెగా పిక్సెల్ ప్రైమరీ సోనీ ఐఎంఎక్స్896 సెన్సర్ కెమెరాతోపాటు ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్, రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 80వాట్ల పాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్నది.

**రియల్‌మీ14ప్రో 5జీ సిరీస్ ఫోన్ల ధరలు ఇలా**

రియల్‌మీ 14 ప్రో 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.24,999, 8జీబీ ర్యామ్ ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.26,999 పలుకుతుంది. ఈ ఫోన్ జైపూర్ పింక్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. రియల్‌మీ 14 ప్రోం 5జీ ఫోన్ 8జీబీ ర్యామ్ ం128 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.29,999, 8జీబీ ర్యామ్ం256జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.31,999, 12జీబీ ర్యామ్ ం256 జీబీ స్టోరేజీ వేరియంట్ రూ.34,999 లకు లభిస్తుంది. ఈ ఫోన్ బికనీర్ పర్పుల్, పెరల్ వైట్, గ్రే రంగుల్లో లభిస్తుంది. అర్హత గల బ్యాంకు కార్డులపై కొనుగోలు చేసిన వారికి రూ.4,000 వరకూ క్యాష్ బ్యాక్ ఆఫర్ అందుబాటులో ఉంటుంది. ఈ నెల 23 నుంచి రియల్‌మీ 14 సిరీస్ ఫోన్ల ప్రీ బుకింగ్స్ ప్రారంభం అవుతాయి. అదే రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి ఫ్లిప్‌కార్ట్, రియల్‌మీ ఆన్‌లైన్ స్టోర్, ఆఫ్‌లైన్ రిటైల్ స్టోర్లలో లభిస్తాయి.

**రియల్‌మీ14ప్రోం 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14 ప్రోం ఫోన్ ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రియల్‌మీ యూఐ 6.0 వర్షన్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్‌తోపాటు 6.83-అంగుళాల 1.5కే(1,272ఐ2,800 పిక్సెల్స్) అమోలెడ్ డిస్ ప్లే, 3840 హెర్ట్జ్ పీఎండబ్ల్యూ డిమ్మింగ్, 1500నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. ఈ ఫోన్ డిస్‌ప్లే కార్నింగ్ గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్‌తో పని చేస్తుంది. స్నాప్ డ్రాగన్ 7ఎస్ జెన్3 ప్రాసెసర్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ 1/1.56-అంగుళాల సోనీ ఐఎంఎక్స్896 ప్రైమరీ సెన్సర్ కెమెరా విత్ ఆప్టికల్ ఇమేజ్ స్టేబిలైజేషన్, 8- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్896 ఆల్ట్రావైడ్ షూటర్, 50-మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్882 సెన్సర్ పెరిస్కోప్ కెమెరా విత్ ఓఐఎస్ సపోర్ట్ విత్ అప్‌టూ 3ఎక్స్ ఆప్టికల్ జూమ్, 6ఎక్స్ లాస్‌లెస్ జూమ్ ఉంటుంది. సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 32- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటుంది. రియల్‌మీ14 ప్రోం ఫోన్ 5జీ, 4జీ ఎల్టీఈ, వై-ఫై 6, బ్లూటూత్ 5.2, జీపీఎస్, గ్లోనాస్, బైదూ, గెలీలియో, క్యూజడ్ఎస్ఎస్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ కలిగి ఉంటుంది. 80వాట్ల వైర్డ్ ఫాస్ట్ చార్జింగ్ మద్దతుతో 6,000 ఎంఏహెచ్ కెపాసిటీ గల టైటాన్ బ్యాటరీతో వస్తోందీ ఫోన్.

**రియల్‌మీ14ప్రో 5జీ స్పెషిఫికేషన్స్**

రియల్‌మీ14ప్రో 5జీ ఫోన్ 6.77-అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే విత్ 120 హెర్ట్జ్ రీఫ్రెష్ రేట్, 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉంటుంది. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ కోటింగ్ ప్రొటెక్షన్ ఉంటుంది. మీడియాటెక్ డైమెన్సిటీ 7300 ఎనర్జీ 5జీ చిప్‌సెట్‌పై పని చేస్తుంది. ఈ ఫోన్ 50- మెగా పిక్సెల్ సోనీ ఐఎంఎక్స్ 882 రేర్ కెమెరా విత్ ఓఐఎస్, సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 16- మెగా పిక్సెల్ సెన్సర్ కెమెరా ఉంటాయి. డ్యుయల్ స్పీకర్స్ విత్ హై రెస్ సర్టిఫికేషన్ కలిగి ఉంటుంది. రియల్‌మీ14ప్రోం 5జీ ఫోన్‌లో మాదిరే కనెక్టివిటీ ఆప్షన్లు ఉంటాయి. సెక్యూరిటీ కోసం ఇన్‌డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. 45వాట్ల చార్జింగ్ మద్దతుతో 6000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తుంది. ఈ ఫోన్‌లు కోల్డ్ సెన్సిటివ్ కలర్ చేంజింగ్ టెక్నాలజీతో రూపుదిద్దుకున్నాయి. ఉష్ణోగ్రతల్లో మార్పులకు అనుగుణంగా పెరల్ వైట్ వేరియంట్ ఫోన్ రంగులు మారుతూ ఉంటుంది. 16 డిగ్రీల సెల్సియస్ వద్ద ఫోన్ కలర్ తిరిగి వస్తుంది.

# పన్నుల భారం తగ్గించాలి

**ఇక్రా బడ్జెట్ విన్నపం**



వచ్చే కేంద్ర బడ్జెట్‌లో వ్యక్తిగత ఆదాయ పన్ను (ఐటీ) భారం తగ్గించక తప్పదని ప్రముఖ రేటింగ్ సంస్థ ఇక్రా స్పష్టం చేసింది. ఈ భారం తగ్గితే తప్ప వినియోగ వ్యయం పెరిగి జీడీపీ వృద్ధిరేటు పుంజుకునే అవకాశం లేదని పేర్కొంది. గత సెప్టెంబరు త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు రెండేళ్ల కనిష్ట స్థాయి 5.4 శాతానికి పడిపోయిన నేపథ్యంలో ఇక్రా ఈ హెచ్చరిక చేసింది. వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మూలధన పెట్టుబడులు కూడా రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండాలని సూచించింది.

**రూ.1.4 లక్షల కోట్ల లోటు :** ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.11.11 లక్షల కోట్ల మూలధన పెట్టుబడుల్లో రూ.1.4 లక్షల కోట్లు లోటు ఏర్పడే అవకాశం ఉందని ఇక్రా ప్రధాన ఆర్థికవేత్త అది తి నాయర్ చెప్పారు. గత ఏడాది ఏప్రిల్-నవంబరు మధ్య కాలంలో మొత్తం మూలధన పెట్టుబడుల్లో 46 శాతం (రూ.5.13 లక్షల కోట్లు) మాత్రమే ఖర్చు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వచ్చే ఆర్థిక సంవత్సరానికి రుణ సేకరణను నియంత్రిస్తూ మూలధన పెట్టుబడులు రూ.11 లక్షల కోట్ల స్థాయిలో ఉండేలా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చర్యలు తీసుకోవాలన్నారు. **4.5 శాతం ద్రవ్య లోటు సాధ్యమే :** ఆదాయ వృద్ధిరేటును పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ద్రవ్యలోటును జీడీపీలో 4.5 శాతం వద్ద కట్టడి చేయడం పెద్ద కష్టమేమీ కాదని నాయర్ స్పష్టం చేశారు. అపుడు మూలధన పెట్టుబడుల కోసం రూ.11 లక్షల కోట్లు కేటాయించడం సాధ్యమవుతుందన్నారు.

**దిగుమతులు కట్టడి చేయాలి : ఈవై**

పడిపోతున్న రూపాయి మారకం రేటును నిలబెట్టేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై సూచించింది. ఇందుకోసం దిగుమతులపై సుంకాలు పెంచాలని కోరింది. ఇలా చేయడం వల్ల డాలర్లకు గిరాకీ తగ్గి, రూపాయి మారకం రేటు కుదు టపడుతుందని తెలిపింది.

**పన్నుపోటు తగ్గించండి: క్రెడాయ్**

అందుబాటు ధరల (అఫర్డబుల్) గృహ ప్రాజెక్టులపై ఆదాయ పన్ను 15 శాతానికి కుదించాలని రియల్ ఎస్టేట్ రంగం కోరింది. అలాగే ఈ తరహా ప్రాజెక్టులు చేపట్టే కంపెనీలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని కోరింది. అలాగే అందుబాటు ధరల గృహ నిర్వచనాన్నీ ప్రస్తుతం రూ.45 లక్షల నుంచి మరింత పెంచాలని విజ్ఞప్తి చేసింది.

**టూ వీలర్లపై జీఎసటీ తగ్గించాలి : హీరో మోటోకార్ప్**

కనీసం 125 సీసీ వరకు సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్ టీని 28నుంచి 18 స్థాయికి కుదించాలని హీరో మోటోకార్ప్ కోరింది.